నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | ఆదివారం 9 మార్చి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



జెండా ఊపి బస్సు ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మార్చి 8 : మహిళా సంఘాల కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నదని, వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో శనివారం సాయంత్రం మహిళా సంఘాల అద్దె బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా నుంచి బయలుదేరిన 2 బస్సులను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి మహిళా సమాఖ్యకు ఒక బస్సు చొప్పున కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చుకునే అవకాశం కల్పిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకులంలో కలెక్టర్ బస



సాంఘిక సంక్షేమ బాలుర గురుకులంలో నిద్రిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

బెల్లంపల్లి, మార్చి 8 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సెంట్రల్ ఆఫ్ ఎక్సలెన్సీలో కలెక్టర్ కుమార్ దీపక్ శుక్రవారం రాత్రి బస చేశారు. పాఠశాల ఆవరణ, డార్మెటరీ, డైనింగ్ హాల్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థుల యోగ క్షేమాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. వ్యసనాలపై ధ్యాస ఉంచకుండా చదువు, క్రీడలపై దృష్టి కేంద్రీకరించాలని పేర్కొన్నారు. ఆయనతో పాటు ఆర్డీవో హరికృష్ణ, ఎంపీడీవో మహేందర్, ఎంఈవో జాడి పోచయ్య ఉన్నారు.

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని రెబ్బెనపల్లి చెరువులో అడుగంటిన నీరు

● చెరువు ఎండెన్..



మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని ముక్కాసిగూడలో నీరు లేక ఎండిన పొలాలు

● నెర్రలువారిన నేల



# జలం అధఃపాతాళం

కాంగ్రెస్ తెచ్చిన కరువు

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పడిపోయిన నీటిమట్టాలు

- ఎండాకాలం ప్రారంభానికి ముందే ఆందోళనకర పరిస్థితి
- గతేడాదితో పోలిస్తే ఈసారి భారీగా పడిపోయిన భూగర్భ జలాలు
- చెరువుల్లో నీరు లేక, బోర్లపై ఆధారపడుతున్న రైతన్నలు
- పంటలకు సరిపడా తడులు అందించలేక సతమతం

మంచిర్యాల, మార్చి 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. గడిచిన నాలుగేళ్లలో ఎప్పుడూ లేని స్థాయిలో నీటి వనరులు అధఃపాతాళానికి పడిపోయాయి. గతేడాది ఈ సమయంలో మంచిర్యాల జిల్లాలో 6.26 అడుగుల నీటిమట్టం ఉంటే.. ఇప్పుడు 6.63 మీటర్ల లోతులో ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో గతేడాది 7.40 మీటర్ల నీరు ఉండగా ఈ ఏడాది 8.54 మీటర్లకు చేరాయి. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గతేడాది 7.13 మీటర్లు ఉండగా.. ప్రస్తుతం 7.35 మీటర్లు, నిర్మల్ జిల్లాలో గతేడాది 7.87 మీటర్ల లోతులో నీరుండగా ఈ ఏడాది 9.07 మీటర్లకు నీటిమట్టం పడిపోయింది. వేసవి ప్రారంభానికి ముందే ఈ పరిస్థితి ఉంటే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి మరింత దారుణంగా మారొచ్చని అధికారులు అంటున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది జిల్లాలో వర్షాలు సమృద్ధిగానే కురిశాయి. ఆదిలాబాద్ జిల్లా సాత్నాల, నిర్మల్ జిల్లాలో గడ్డెన్న వాగు, కడెం ప్రాజెక్టులతోపాటు మంచిర్యాల శివారు పెద్దపల్లి జిల్లా పరిధిలోకి వచ్చే ఎల్లంపల్లి ప్రాజెక్ట్, ఆసిపాబాద్ జిల్లాలోని కుమ్రం భీం ప్రాజెక్ట్‌లోకి భారీగా నీరు చేరింది. కానీ.. రెండేళ్ల క్రితం మాదిరి వరదల సమయంలో చెరువులను నింపకపోవడం కొంత ఇబ్బందిగా మారింది. అటు ప్రాజెక్టుల్లో నీరు దగ్గరపడడం, ఇటు చెరువులు ఎండిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి.


### చివరి ఆయకట్టు రైతులకు నీటి కష్టాలు

కడెం చివరి ఆయకట్టుగా ఉన్న మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సాగు నీటి ఇక్కట్లు మొదలయ్యాయి. దండేపల్లి మండలంలోని ముక్కాసిగూడలో ఇప్పటికే 50 ఎకరాల దాకా వరి పంట నీరు లేక ఎండిపోతున్నది. కడెం డిస్ట్రిబ్యూటరీ కాలువల నీరు జన్నారం మండలంలోని తపాల్‌పూర్ దాకే వస్తున్నది. దండేపల్లి మండలంలోని చాలా గ్రామాలకు ఆ నీరు రావడం లేదు. నిర్మల్ జిల్లా గడ్డెనవాగు ప్రాజెక్ట్ ప్రధాన కాలువ నిర్మాణం ఇంకా పూర్తికాలేదు. కేసీఆర్ సర్కారు రూ.6 కోట్లతో 20 కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణం పూర్తి చేయించింది. మరో 8 కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉండడంతో భైంసా, లోకేశ్వరం మండలాల్లోని పొలాలకు నీరు అందని పరిస్థితి నెలకున్నది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే వరి అధికంగా సాగు చేసే జిల్లాలైన మంచిర్యాల, నిర్మల్ జిల్లాల రైతులు అటు ప్రాజెక్టుల నీరు రాక, ఇటు చెరువుల్లో నీరు లేక ఎక్కువగా బోర్లపైనే ఆధారపడుతున్నారు. పదేళ్ల క్రితం ఎలాగైతే బోర్లపై ఆధారపడి సాగు చేశామో ఇప్పుడు అదే పరిస్థితి వచ్చిందని చెప్తున్నారు. బోర్లు లేని రైతులు కొత్తగా బోర్లు వేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ నేపథ్యంలో భూగర్భంలోనూ నీటిమట్టాలు అడుగంటిపోతుండడం రైతులకు కష్టంగా మారనుంది. గతంలో 100 ఫీట్లకు బోరు పడిన చోట ఇప్పుడు 150 ఫీట్ల నుంచి 200 ఫీట్ల వరకు బోరు వేయాల్సి వస్తుంది. దీంతో రైతులపై అదనపు భారం పడుతున్నది. అదృష్టం బాగుండి బోరు పడితే పర్లేదు.. కానీ కర్మకాలి బోర్ ఫెయిలయ్యిందా రైతులపై లక్షల రూపాయల అదనపు భారం పడుతుంది.

### ఐదు మండలాల్లో పాతాళానికి..

మంచిర్యాల జిల్లాలో ప్రస్తుతం సగటున 6.63 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా ఐదు మండలాల్లో పరిస్థితి మరీ దారుణంగా మారింది. జైపూర్ మండలంలో 18.19, కోటపల్లిలో 16.59, తాండూర్‌లో 15.12, బెల్లంపల్లిలో 15.03, మందమర్రిలో 12.73 మీటర్ల లోతులో భూగర్భ జలమట్టాలు ఉన్నట్లు భూగర్భ గనుల శాఖ తాజా నివేదిక స్పష్టం చేస్తున్నది. మిగిలిన మండలాల్లో పరిస్థితి కాస్త మెరుగ్గా ఉంది. గడిచిన రెండేళ్లలో భూగర్భ జలాలు దారుణంగా పడిపోయాయి. 2022 సంవత్సరంలో ఈ సమయానికి 5.96 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా, 2023లో 5.95 మీటర్లు ఉన్నాయి. 2024లో ఒక్కసారిగా 6.26 మీటర్లకు పడిపోయిన జలమట్టం ప్రస్తుతం 6.63 మీటర్లకు దిగజారింది. మండు వేసవిలో మరింత లోలోతుకు జలమట్టం పడిపోయే అవకాశాలు ఉన్నాయి.






దండేపల్లి మండలంలోని ముక్కాసిగూడలో ..

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- జనరల్ సర్జన్ డా.కళావతి
- నారాయణ హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం



కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకుంటున్న మహిళలు

మంచిర్యాల అర్బన్, మార్చి 8 : మహిళలు అన్ని రంగాల్లో రాణించి, ఆర్థికాభివృద్ధి సాధించాలని ప్రముఖ జనరల్ సర్జన్ డా.కళావతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నారాయణ జనరల్ అండ్ సర్జికల్ హాస్పిటల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తమ పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిద్దాలని పేర్కొన్నారు. అనంతరం హాస్పిటల్ డైరెక్టర్ యోహన్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో మొట్టమొదటి మహిళా జనరల్ సర్జన్ ఇక్కడ సేవలు అందించడం సంతోషంగా ఉందని, మహిళలందరూ వైద్య సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. దాదాపు 200 మందికిపైగా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించినట్లు వెల్లడించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ప్రముఖ విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, వ్యాపారస్తులు, కాలనీవాసులు, సిబ్బంది ఉన్నారు.

## మహిళల పాత్ర కీలకం



ఉపాధ్యాయురాలికి ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న కలెక్టక్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాల అర్బన్, మార్చి 8 : కుటుంబాన్ని తీర్చిదిద్దడం నుంచి దేశాన్ని పాలించే వరకూ.. అన్ని రంగాల్లో మహిళల పాత్ర కీలకమైనదని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని డీసీపీ భాస్కర్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, జిల్లా సంక్షేమశాఖ అధికారి రౌవూఫ్‌ఖాన్‌తో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు సామాజికంగా ఎంతో తోడ్పాటునందిస్తున్నారన్నారు. ప్రభుత్వం మహిళల సంక్షేమానికి కృషి చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహిస్తున్నదని, అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన మహిళా అధికారులు, ఉద్యోగులను ప్రశంసా పత్రాలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

## కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు ఎండుతున్న పంటలు

- కొంచవెల్లిలో తరచూ తలెత్తుతున్న సమస్య..
- పక్షం రోజుల్లో మూడింటిని అమర్చినా ఫలితం శూన్యం
- తాజాగా మరొకటి ఏర్పాటు.. ఇదైనా పనిచేసేనా?
- ఇప్పటికే దెబ్బ తిన్న వరి.. రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం
- కేసీఆర్ సర్కారులో రందిలేకుండేనంటున్న అన్నదాతలు

దహెగాం, మార్చి 8 : మండలంలోని కొంచవెల్లిలో తరచూ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుండగా, పొట్టకొచ్చే దశలోనున్న పంటలు ఎండిపోతున్నాయి. పక్షం రోజుల్లో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు మార్చినా ఫలితం లేకపోగా, కష్టనష్టాలకోర్చి వేసిన వరి చేతికందకుండా పోయే పరిస్థితులు దాపురించాయి. తాజాగా.. మరో ట్రాన్స్‌ఫార్మర్ అమర్చినట్లు తెలుస్తుండగా, లో వోల్టేజీ సమస్య వల్ల ఇదైనా పనిచేస్తుందా.. లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ఎండి పోతున్న వరి పంట

### ఇప్పటికే ఎండిన వరి..

యాసంగిలో కొంచవెల్లి రైతులు బోర్లపై ఆధారపడి వరి సాగు చేశారు. కరెంట్ సరఫరాకు సంబంధించి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టకపోవడంతో తరచూ సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ క్రమంలో గత నెల 23న కెనాల్ ఏరియాలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోయింది. 'పంటలు ఎండిపోతున్నాయి.. జర పట్టించుకోండి సారూ' అంటూ రైతులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసి మొరపెట్టుకోగా, ఈ నెల 3న కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చారు. అది ఆన్ చేయగానే కాలిపోయింది. ఈ నెల 7(శుక్రవారం)న మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి ఆన్ చేయగా, అది కూడా కాలిపోయింది. సాంకేతిక లోపాల కారణంగా తరచూ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుండగా, సుమారు 40 ఎకరాల్లో వేసిన వరి చేతికందకుండా పోయే పరిస్థితి వచ్చింది. ఇప్పటికే చాలా వరకు పంట ఎండిపోగా, దిగుబడిపై ప్రభావం చూపే అవకాశమున్నది. కేసీఆర్ సర్కారులో 24 గంటల కరెంట్‌తో రంది లేకుంట పంటలు తీశామని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పుణ్యామాని బతుకులు ఆగమవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఏఈ, లైన్ ఇన్‌స్పెక్టర్‌లను వివరణ కోరేందుకు యత్నించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

### ఇదైనా పనిచేసేనా..?



సాంకేతిక సమస్యల కారణంగా పాడైపోయిన ట్రాన్స్‌ఫార్మర్(ఫైల్)

కొంచవెల్లిలో తరచూ విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. లో వోల్టేజీ వల్లే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నట్లు తెలుస్తున్నది. పక్షం రోజుల్లో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు మార్చినా ఫలితం లేకుండా పోయింది. తాజాగా.. శనివారం మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు తెలుస్తుండగా, ఇదైనా పనిచేస్తుందో లేదోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు సమస్య ఎక్కడ ఉందో గుర్తించి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తే బాగుంటుందని రైతులు చెబుతున్నారు.

### నాలుగెకరాల్లో వరి ఎండిపోతుంది



మా ఊరిలో నాకు నాలుగెకరాలు ఉంది. అందులో వరి వేసిన. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో సార్ల చుట్టూ తిరిగితే అమర్చిన్రు. అది కూడా కాలిపోయింది. ఇప్పటికి రెండుసార్లు గిట్లనే అయ్యింది. ఇప్పటికీ పక్షం రోజులైతంది పంటకు నీళ్లలేక. కండ్లముందే పంట ఎండిపోతుంటే ఏం చేయాలో తోచడం లేదు. అప్పులు చేసి పంటలేస్తిమి. ఇప్పుడు మాకు దిక్కెవరు. - వెంకటేశ్, రైతు, కొంచవెల్లి

### దు:ఖం వస్తుంది



తరచూ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నయి. బోర్లు పోయక కండ్లముందే పంట ఎండిపోతుంటే దు:ఖం వస్తుంది. సాంకేతిక లోపాల వల్ల ఇప్పటికీ మూడుసార్లు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. అధికారులు విద్యుత్ లేన్‌లను ఎప్పటికప్పుడు పరిశీలించి మరమ్మతులు చేస్తే ఇలా అయ్యేది కాదు. కేసీఆర్ సర్కారులో రంది లేకుంట పంటలు తీసినం. గిప్పుడు గిసొంటి గోస వచ్చింది. - రావూజీ, రైతు, కొంచవెల్లి